కరుణామయుడు, కృపాసాగరుడయిన దేవుని పేరుతో ప్రారంభం

# 3. మహనీయ ముహమ్మద్ (సల్లం)

-అబుల్ ఇర్ఫాన్, ఇస్లామిక్ రిసోర్స్ సెంటర్

ప్రపంచంలో ఎందరో మహాపురుషులు, దైవప్రవక్తలు ఉద్భవించి లోక కల్యాణం కోసం తమ వంతు కృషి చేశారు. అయితే ప్రవక్తలకు, ప్రవక్తేతరులకు ఎంతో వ్యత్యాసం ఉంది. ప్రవక్తేతరులయిన మహాపురుషులు సహజసిద్ధంగా తమకున్న జ్ఞానం, శక్తి సామర్థ్యాలను బట్టి మాత్రమే పని చేశారు, చేస్తున్నారు. కాని దైవప్రవక్తలు తమకున్న జ్ఞానం, శక్తి సామర్థ్యాలను సృష్టికర్త నుండి లభించే దివ్యజ్ఞానం ప్రకారం వినియోగిస్తూ లోకకల్యాణం కోసం పనిచేస్తారు. దైవప్రవక్తలకు ఈ జ్ఞానం సందర్భానుసారం దివ్యావిష్కృతి (Revelation) ద్వారా కొద్ది కొద్దిగా లభిస్తుంది.

అనాది నుండి నేటియుగం వరకు లక్షలాది మంది దైవప్రవక్తలు ప్రభవించారు. వారందరూ ఒకే విధమైన మౌలిక బోధనలు తెచ్చారు. అందరూ సృష్టిపూజను, మిధ్యాదైవాల ఆరాధనను ఖండిస్తూ సృష్టికర్త, విశ్వపాలకుడు, పరిపోషకుడయిన ఏకేశ్వరుడ్ని మాత్రమే ఆరాధించాలని; ఆయన ఆజ్ఞల ప్రకారమే జీవితం గడపాలని; తద్వారా మాత్రమే ఇహలోకంలో శాంతి, పరలోకంలో మోక్షం లభిస్తాయని తెలియజేశారు. మహనీయ ముహమ్మద్ (సల్లం) కూడా ఈ విషయాన్నే బోధించారు. ఈ మౌలిక బోధనలకు సంబంధించిన ధర్మాన్నే ఇస్లాం అంటారు. దాని అనుచరులనే ముస్లింలు అంటారు.

దాదాపు ప్రతి జాతిలోనూ దైవప్రవక్తలు ఉద్భవించారు. అయితే గత ప్రవక్తలు తెచ్చిన బోధనలు ప్రక్షిప్తాలకు, నిక్షిప్తాలకు గురయి పోయినందున దేవుడు నేటి కలియుగంలో మహనీయ ముహమ్మద్ (సల్లం)ని అంతిమ దైవప్రవక్తగా ప్రభవింపజేశాడు. ముహమ్మద్ ప్రవక్త (సల్లం) రాక గురించి ఆయన పుట్టక ముందు, పుట్టిన తరువాత ఎందరో క్రైస్తవ పండితులు, సాధువులు భవిష్యత్ ప్రకటనలు చేశారు.

మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) క్రీ.శ. 570, రబీవుల్ అవ్వల్ మాసం సోమవారం నాడు అరేబియాలోని మక్కా పట్టణంలో జన్మించారు. ముహమ్మద్ (సల్లం) జన్మించడానికి కొన్నాళ్ళ పూర్వమే ఆయన తండ్రి చనిపోయాడు. ఏడేళ్ళ వయసులో తల్లి కూడా ఇహలోకం వీడిపోవడంతో ఆయన అనాథ అయ్యారు. అనాథ అయిన బాల ముహమ్మద్ (సల్లం)ని తాత అబ్దుల్ ముత్తలిబ్ తన సంరక్షణలోకి తీసుకున్నాడు. కాని ఆ తర్వాత ఒక సంవత్సరానికే తాత కూడా కాలం చేస్తాడు. అప్పుడు పెదనాన్న అబూతాలిబ్ ఆయన్ని తన సంరక్షణలోకి తీసుకొని కంటికి రెప్పలా చూసుకుంటాడు.

ఆ కాలంలో యావత్తు ప్రపంచం విగ్రహారాధన, మూఢనమ్మకాలలో పూర్తిగా మునిగి ఉండింది. అరేబియాలో విగ్రహారాధనతో పాటు జనం నైతికంగా అనేక చెడుగులలో బాగా కూరుకుపోయి ఉన్నారు. సభ్యతా సంస్కారాలు పూర్తిగా కొరవడ్డాయి. సభ్యతా



సంస్కారాలులేని ఆనాటి అరబ్ సమాజంలో మూఢనమ్మకాలు, మూఢాచారాలు, మద్య సేవనం, మగువ లోలత్వం మస్తుగా ఉండేవి. వీటికి తోడు అరబ్బులు తెగ విద్వేషం, జాతీయ దురభిమానాలతో చీటికిమాటికి పరస్పరం కత్తులు దూసుకుంటూ సంవత్సరాల తరబడి యుద్ధాలు చేసుకునేవారు.

ఇలాంటి సమాజంలో పిల్లలక్కూడా పెద్దల బుద్ధులే రావడం సహజం. కాని బాల ముహమ్మద్ (సల్లం)పై ఈ చెడు సమాజం ప్రభావం పడకుండా విధి ఆయన్ని మేకల కాపరిగా చేసి ఏకాంత ప్రదేశాల్లో నోరులేని జీవాల మధ్య ప్రకృతి దృశ్యాల చాటున సుశిక్షణ ఇచ్చింది. స్వయంగా ముహమ్మద్ (సల్లం)కు కూడా అరబ్బుల జీవన విధానం నచ్చలేదు. ఆయన నిరంతరం ప్రకృతిని అవలోకిస్తూ, సమాజసంస్కరణ గురించి ఆలోచిస్తూ, ఆధ్యాత్మిక చింతనలో ఉండేవారు.

యౌవన వయస్సు వచ్చిన తరువాత ఆయన వర్తకం చేసి నీతిమంతుడయిన వర్తకునిగా ఖ్యాతి చెందారు. హజ్ సీజన్ వస్తే, వర్తకులందరిలో ముహమ్మద్ (సల్లం) మాత్రమే ఎక్కువ మంది కొనుగోలుదారులను ఆకట్టుకునేవారు. కారణం ఆయన ఎలాంటి మోసం చేయకుండా నిజాయితీగా వ్యవహరిస్తారు; ఇతరులకంటే తక్కువ ధరలకు సరుకు అమ్ముతారు. అయితే ఆయన ఆర్థిక పరిస్థితి మాత్రం ఎదుగుబొదుగూ లేకుండా ఉండేది. దానికి కారణం తెలుసుకోవడానికి ఉతబా అనే వర్తకుడు ఒకరోజు రాత్రి దుకాణాలు మూసిన తరువాత రహస్యంగా ముహమ్మద్ (సల్లం) వెనకాలే బయలుదేరి గమనిస్తాడు. అప్పుడు తెలుస్తుంది ముహమ్మద్ (స) వ్యాపారంలో వచ్చే లాభాలను పేదలకు, అనాథలకు దానం చేసేవారని.

ఇలా ప్రతి వ్యవహారంలోను ముహమ్మద్ (స) కనబరచే సౌశీల్యం, సద్వర్తనాలు చూసి ప్రజలు ఆయన్ని సాదిఖ్ (సత్యమంతుడు) అని, అమీన్ (నిజాయితీపరుడు) అని పిలిచేవారు. ఈ సద్గుణ సంపత్తిని చూసే నలభై ఏళ్ళ వితంతు మహిళ హజ్రత్ ఖదీజా (రజి) గొప్పగొప్పవాళ్ళని కూడా కాదని ఇరవై అయిదేళ్ళ ముహమ్మద్ (సల్లం)ని వివాహమాడటానికి సిద్ధమయ్యారు. పాతికేళ్ళ నిండు యౌవనంలో ఉండిన ముహమ్మద్ (స) తనకంటే 15 ఏండ్ల ఎక్కువ వయసున్న ఆ వితంతవుని సంతోషంగా వివాహమాడతారు. ఆమెతో కలసి 25 సంవత్సరాలపాటు ఎంతో అన్యోన్యంగా కాపురం చేస్తారు. ఈ 25 ఏండ్ల కాలంలో ఆయన మరో స్త్రీని వివాహమాడే తలంపును కూడా తన మనసులోకి రానీయలేదు. ఆ తరువాతే ఆయన తన అనుచరులతో సంబంధాలను మరింత పటిష్ఠ పరచుకోవడానికి, ఇస్లామీయ విప్లవమార్గంలో అవరోధంగా ఉన్నవారి శక్తిని, సంఖ్యను తగ్గించడానికి ఇతర స్త్రీలను పెళ్ళి చేసుకోవలసి వచ్చింది. వారిలో ఎక్కువ మంది వితంతువులు, విడాకులు పొందిన స్త్రీలే ఉన్నారు.

ఆనాడు బానిసవ్యవస్థ పకడ్బందీగా ఉండేది. ముహమ్మద్ (స) దైవప్రవక్త అయిన తరువాత పెద్దఎత్తున బానిస విమోచనోద్యమం సాగించి వేలాదిమందికి బానిసత్వం నుంచి శాశ్వతంగా విముక్తి కల్గించారు. ఆయనసలు దైవప్రవక్త కాకముందు నుంచే

బానిసవ్యవస్థను అసహ్యించుకునేవారు. అర్ధాంగి ఖదీజా (రజి) ఓ బానిన బాలుడ్ని ఇస్తే ముహమ్మద్ (స) తక్షణమే ఆ బాలుడికి బానిసత్వం నుంచి విముక్తి కలిగిస్తారు.

కొన్నాళ్ళకు పిల్లవాడి తండ్రి, పినతండ్రి వచ్చి "మా పిల్లవాడ్ని మాకు అప్ప గించండి; మీరెంత ధర అడిగినా ఇచ్చుకుంటాం" అంటారు. దానికి ఆయన "పిల్లవాడి ఇష్టాయిష్టాల మీద వదిలేద్దాం. పిల్లవాడు మీ దగ్గరకు వస్తానంటే తీసికెళ్ళండి; నాకు డబ్బు ఇవ్వనవసరం లేదు. నాదగ్గరే ఉంటానంటే మాత్రం నేను మీకు అప్పగించలేను" అన్నారు. పిల్లవాడు ముహమ్మద్ (సల్లం) సద్వర్తనంతో ఇదివరకే ప్రభావితుడయి ఉన్నందున తండ్రి, పినతండ్రుల వెంట సొంతూరుకు పోవడానికి నిరాకరిస్తాడు. అప్పుడు ముహమ్మద్ (సల్లం) ఆ బాలుడ్ని కాబాలయానికి తీసికెళ్ళి ప్రజల ముందు ఆ బాలుడ్ని తన పెంపుడు కొడుకుగా చేసుకుంటున్నట్లు ప్రకటిస్తారు.

వయస్సు పెరుగుతున్న కొద్దీ ముహమ్మద్ (సల్లం)లో ఆధ్యాత్మిక చింతన కూడా అధికం కాసాగింది. ఆయన తరచుగా ఓ కొండ గుహకెళ్ళి దైవధ్యానంలో లీనమైపోయే వారు. ఓరోజు ఉన్నట్లుండి గుహలోకి హఠాత్తుగా ఒక అపరిచిత వ్యక్తి వచ్చి "చదువు నీ ప్రభువు పేరుతో" అన్నాడు. ముహమ్మద్ (సల్లం) తనకు చదవటం రాదన్నారు. ఆ వ్యక్తి ముహమ్మద్ (సల్లం)ని గట్టిగా గుండెలకు హత్తుకొని వదిలేస్తూ మళ్ళీ "చదువు నీప్రభువు పేరుతో" అన్నాడు. ముహమ్మద్ (సల్లం) భయపడుతూ తనకు చదవటం రాదన్నారు. ఇలా మూడుసార్లు జరిగింది. చివరికి ఆ వ్యక్తి అదృశ్యమైపోయాడు.

ఈ సంఘటనతో ముహమ్మద్ (సల్లం) భయపడిపోయి ఇంటికొచ్చి పడక మీద వాలి "దుప్పటి కప్పు" అన్నారు వణికిపోతూ భార్యతో. భయాందోళనలు కొంచెం తగ్గిపోయిన తరువాత జరిగిన సంగతి చెప్పారు. ఆ తరువాత ఆయన భార్య ఆయన్ని వరఖా బిన్ నౌఫల్ అనే ఓ దూరపు బంధువు దగ్గరకు పిలుచుకెళ్ళి గుహలో జరిగిన వృత్తాంతం వివరించారు. వరఖా క్రైస్తవ, యూద మతగ్రంథాలను కాసివడపోసిన ప్రఖ్యాత పండితుడు. అంచేత వెంటనే ఆయన విషయం గ్రహించి, గుహలో ప్రత్యక్షమైన ఆ కొత్త వ్యక్తి దేవుని దగ్గర్నుంచి దైవప్రవక్తలకు దివ్యసందేశం చేరవేసే దైవదూత (జుదీవీలిజి) జిబ్రీల్ అని, ముహమ్మద్ ఇప్పుడు దైవప్రవక్త అయ్యాడని తెలియజేశాడు.

ఈ విధంగా సృష్టికర్త నుంచి దైవసందేశం అవతరించే దివ్యావిష్కృతి ప్రారంభం అవుతుంది. దివ్యావిష్కృతి ద్వారా లభించిన దైవాజ్ఞల ప్రకారం ముహమ్మద్ (సల్లం) ఏకేశ్వరోపాసనా ప్రచారం ప్రారంభిస్తారు. దాంతో జనం మొదట్లో ఆయన్ని వింతగా చూసి హేళన చేశారు. తరువాత క్రమంగా ఆయనకు శత్రువులయిపోతారు.

దాంతో ఆయనపై కష్టాలు వచ్చిపడ్డాయి. సత్యతిరస్కారులు ఆయన్ని రకరకాలుగా వేధించేవారు. పెదనాన్న అబూలహబ్, అతనిభార్య అయితే బంధుత్వాన్ని సైతం ఖాతరు చేయకుండా ముహమ్మద్ (సల్లం)ని వేధించేవారు. ఆయన నడిచే బాటపై ముండ్లు పరిచేవారు; ఇంటి ఆవరణలో ప్రార్థన చేస్తుంటే పిట్టగోడ మీదనుంచి పైన మలినాలు పడవేసే వారు. అయినప్పటికీ ఆయన చూస్తూ సహించడం తప్ప పల్లెత్తు మాట కూడా



అనేవారుకాదు. కాకపోతే మితిమీరిన దౌర్జన్యాలతో విసుగెత్తి "ముత్తలిబ్ వంశీయులారా! మీ పొరుగువారిపట్ల ప్రవర్తించే తీరు ఇదేనా!" అని మాత్రం అనేవారు.

మరోవైపు జనం క్రమంగా ఇస్లాంని విశ్వసించి ఆయనకు అనుచరులై పోసాగారు. బహుదైవరాధకులైన ఖురైష్ తెగ నాయకులు ఈ నూతన ధర్మాన్ని విశ్వసించినవారిని కూడా హింసించడం మొదలెట్టారు. ముస్లింలసంఖ్య పెరిగినకొద్దీ వారిపై దుష్ప్రచారం, దౌర్జన్యాలు కూడా అధికమయ్యాయి. మూడేళ్ళ పాటు సంఘబహిష్కరణ కూడా జరుగుతుంది. మహనీయ ముహమ్మద్ (సల్లం) మక్కా ప్రజలతో విసిగిపోయి తాయెఫ్ పట్టణానికి వెళ్తే అక్కడి ప్రజలు కూడా ఆయన్ని తిరస్కరించి వెళ్ళగొడ్తారు.

ఒక స్త్రీ అయితే ఆయన బజారున నడచి పోతున్నప్పుడు ఆయన మీద కసువు ఊడ్చి పోసేది. ఇలా రోజూ జరిగేది. అయితే ఓసారి రెండు మూడు రోజుల దాకా ముహమ్మద్ (సల్లం) మీద కసువు పడలేదు. దాంతో ఆయనకు అనుమానం వచ్చి ఆ ఇంటికి వెళ్ళి చూస్తే ఆ స్త్రీ జబ్బుతో మంచాన పడి ఉంటుంది. ముహమ్మద్ (సల్లం) ఆమెకు తన సానుభూతి తెలియజేస్తూ ఆమె ఆరోగ్యం కోసం దైవాన్ని ప్రార్థిస్తారు. దాంతో ఆమె ప్రభావితురాలయి ఇస్లాం స్వీకరిస్తుంది.

ఓరోజు ముహమ్మద్ (సల్లం) ఒక అనుచరుడ్ని తీసుకొని ఎక్కడికో పోతుంటారు. దారిలో ఒక పల్లెవాసి వచ్చి ఆయన మెడకు చుట్టుకున్న వస్త్రాన్ని పట్టిలాగుతూ "దేవుడు నీకిచ్చిన ధనం నాకిచ్చేయి" అంటాడు దబాయిస్తూ. అయితే ఈ దురుసు ప్రవర్తన పట్ల ముహమ్మద్ (సల్లం)కు ఆ పల్లెవాసిపై కాస్తయినా కోపం రాదు. పైగా తన అనుచరుని దగ్గర్నుంచి కొంత డబ్బు ఇప్పించి పంపేస్తారు.

ఓసారి ఒక ముసలమ్మ కట్టెలమోపు ఎత్తుకొని భారంగా నడుస్తుంటే ముహమ్మద్ (సల్లం) ఆమె బాధ చూడలేక వెంటనే కట్టెలమోపు తీసుకొని మోస్తూ ఆమె వెంట నడుస్తారు. దారిలో ఆ ముసలమ్మ మాట్లాడుతూ "చూడు బాబూ! ఈ ఊళ్ళో ఎవరో ముహమ్మదట. దైవప్రవక్తనని చెప్పుకుంటూ చేతబడి చేసి జనాన్ని తన వైపుకు తిప్పుకుంటున్నాడట! నువ్వు మాత్రం అతని వలలో పడబాకు" అని చెబుతుంది. ఈమాట విని ఆయన మౌనంగా ఉండిపోతారు. అంతలో కట్టెలమోపు చేర్చవలసిన చోటు వస్తుంది. ముహమ్మద్ (సల్లం) కట్టెల మోపును అక్కడ దించి వెళ్ళి పోవడానికి సిద్ధమవుతారు. ముసలమ్మ తనకు సహాయపడినందుకు సంతోషిస్తూ "నీ పేరేమిటి బాబూ"అని అడుగుతుంది. దానికాయన 'ముహమ్మద్' అని చెబుతారు. ఈపేరు వినగానే ఆ ముసలమ్మ ఎంతో ఆశ్చర్యపోతూ "ఏమిటీ, ముహమ్మద్ అంటే నువ్వేనా! ఇంత మంచిమనిషిని జనం మాంత్రికుడు, పిచ్చివాడు అంటున్నారేమిటీ!! కాదు. ఈయన ఎంతమాత్రం మాంత్రికుడు కాదు. ఈయన నిజంగా దైవప్రవక్తే" అని అంటుంది.

యావత్తు అరేబియా ప్రజలకు మక్కాలోని కాబా ఆలయమే అన్నిటి కంటే గొప్ప ఆరాధనా కేంద్రం. ఈ ఆలయంలో అప్పుడు 360 విగ్రహాలు ఉండేవి. ప్రతిఏడూ ఇక్కడ హజ్ పేరుతో పెద్ద జాతర జరుగుతుంది. దేశం నలుమూలల నుంచి వేలాది మంది

యాత్రికులు వస్తారు. సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి. ప్రజలు రకరకాల కానుకలు సమర్పించుకుంటారు. వందల దుకాణాలు వెలుస్తాయి. ఈ జాతర మూలంగా మక్కా ప్రజలకు ఆర్థికంగా ఎన్నో ప్రయోజనాలు ఒనగూడుతాయి.

ముహమ్మద్ (సల్లం) ఈ జాతరకు బయటినుంచి వచ్చే వివిధ తెగలవారిని కలుసుకొని దైవసందేశం అందజేసేవారు. కాని జనం ఇస్లాం స్వీకరించి ఏకేశ్వరోపాసకులైపోతే తమ ఆర్థిక ప్రయోజనాలకు భంగం వాటిల్లుతుందని, తమ నాయకత్వానికి నూకలు చెల్లిపోతాయని మక్కా నాయకులు భయపడి ముహమ్మద్ (స) ప్రచారానికి అడుగడుగునా ఆటంకాలు కలిగించేవారు. అయినా ఇస్లాం క్రమంగా విస్తరించసాగింది. ముఖ్యంగా మదీనా ప్రజలు ఇస్లాం పట్ల ఎక్కువ ఆసక్తి కనబరిచారు. వారు దైవప్రవక్త (సల్లం)ను మక్కావారి దౌర్జన్యాల బారి నుండి కాపాడి మదీనా తీసికెళ్ళడానికి కూడా సిద్ధమయ్యారు.

మక్కాలో హింసా వేధింపులు మితిమీరిపోవడంతో దైవప్రవక్త (సల్లం) తమ అనుచరుల్ని మదీనా వలసపొమ్మని చెబుతారు. దాంతో అనేకమంది ముస్లింలు రహస్యంగా మక్కా వదలి మదీనా వెళ్ళిపోతారు. దైవప్రవక్త (సల్లం)తో పాటు కొందరు ముస్లింలే మక్కాలో ఉండిపోతారు. మక్కాలో 13 ఏండ్లపాటు ప్రచారం చేసినా పెద్దగా ఫలితం కన్పించలేదు. ఈలోగా మక్కా నాయకులు ముహమ్మద్ (స)ని చంపడానికి ఓరోజురాత్రి ఆయన ఇంటిని చుట్టుముడ్తారు. అయితే దైవప్రవక్త (సల్లం) ఇంట్లో నుంచి బయటికొచ్చి వారిపై ఇసుక మంత్రించి విసురుతారు. దాంతో వారికి దైవప్రవక్త (సల్లం) కన్పించరు. ఆయన వారి ముందు నుంచే నిరాపాయంగా బయటికి వెళ్ళిపోతారు.

ఆ తరువాత కాస్సేపటికి విషయం తెలుస్తుంది ఖురైష్ పెద్దలకు. దాంతో వారు చిందులు తొక్కుతూ దైవప్రవక్త (సల్లం)ను పట్టుకోవడానికి నలువైపులా పరుగెత్తుతారు. దైవప్రవక్త (సల్లం) ఒక ముఖ్య అనుచరుడ్ని తీసుకొని మక్కా వెలుపల ఓ కొండ గుహలోకి వెళ్ళి మూడురోజులు దాక్కొని, తర్వాత మదీనా వెళ్ళిపోతారు. మదీనాలో ఆయనకు ఘనస్వాగతం లభిస్తుంది. దైవప్రవక్త (స) రాకతో మదీనాలో ఇస్లాం మరింత బలం పుంజుకుంటుంది. అక్కడి ఔస్, ఖజ్రజ్ తెగలలో అనేకమంది ఇస్లాం స్వీకరిస్తారు.

అయితే చిత్తశుద్ధిలేని కొందరు పరిస్థితుల ప్రభావం వల్ల ముస్లింలలో చేరిపోయి దైవప్రవక్త (సల్లం) పట్ల ఇస్లాం తేనెపూసిన కత్తుల్లా, కపటి విశ్వాసులుగా తయారవుతారు. వేరొక వైపు యూదులు కూడా ముస్లింలకు పక్కలో బల్లెంలా మారిపోతారు. ఇదిలా ఉంటే అటు మక్కాలో బహుదైవారాధకుల నాయకులు ముహమ్మద్ (సల్లం) మీద కారాలు మిరియాలు నూరుతూ కయ్యానికి కాలుదువ్వడం మొదలెడతారు.

వారు మొదట మదీనా పశువుల కాపర్లపై దాడిచేసి కవ్వింపు చర్యలకు పాల్పడతారు. తర్వాత వేయిమంది యోధులతో యుద్ధానికి బయలుదేరుతారు. ఈ సంగతి తెలిసి దైవప్రవక్త (స) కూడా 312మంది అనుచరుల్ని తీసుకొని బయలుదేరుతారు. మదీనాకు కొన్నిమైళ్ళ దూరంలోఉన్న బదర్‌ప్రాంతంలో ఇరుపక్షాలు ఢీకొంటాయి. మక్కాఅవిశ్వాసులు చిత్తుగా ఓడిపోతారు. ముస్లింలు విజయోత్సాహంతో మదీనా తిరిగొస్తారు.



మక్కా అవిశ్వాసులు బదర్ యుద్ధంలో ఓడిపోయి నిరాశతో చేతులు ముడుచుకొని కూర్చోలేదు. మరుసటి సంవత్సం మూడువేల మంది సైనికుల్ని సమీకరించుకొని వస్తారు. ముస్లిం సేనలో వేయిమంది మాత్రమే ఉంటారు. వారిలోనూ మూడొందల మంది కపటవిశ్వాసులు తాము చెప్పినట్లు ముహమ్మద్ చేయలేదన్న సాకుతో దారిలోనే జారుకుంటారు. తరువాత రెండుపక్షాలు ఉహుద్ ప్రాంతంలో ఢీకొంటాయి. ఈసారి ముస్లిం సేనలోని విలుకాండ్ర వల్ల ఒక పొరపాటు జరుగుతుంది. దానివల్ల కొంత నష్టం జరిగినా మొత్తంమీద అంతిమ విజయం ముస్లింలనే వరిస్తుంది.

ఉహుద్ యుద్ధ ఫలితం మక్కా అవిశ్వాసులకు కొంత ఊతమిస్తుంది. అంచేత వారు యుద్ధోన్మాదంతో ఊగిపోతూ అరేబియాలోని ఇతర తెగలను కలుపుకొని సమర సన్నాహాలు ప్రారంభిస్తారు. మదీనాలోని యూదులు, కపటవిశ్వాసులు కూడా వారికి వత్తాసు పలికి ఉసిగొల్పుతారు. ఇలా అవిశ్వాసులు పన్నెండు వేలమంది సైనికుల్ని సమీకరించుకొని మదీనాపై దాడిచేయడానికి వస్తారు. కాని ముస్లింలు మదీనా చుట్టూ కందకం తవ్వడంతో వారు నీరుగారిపోతారు. అయినా వారు మదీనా యూదుల్ని కలుపుకొని పట్నం లోపలి నుంచి వారు, బయటి నుంచి తాము ఒకేసారి దాడి చేయాలని పథకం వేసుకుంటారు. అయితే అవిశ్వాసుల్లోని ఒక తెగనాయకుడు ముస్లింగా మారి యూదులు–అవిశ్వాసుల ఐక్యసంఘటనను చీల్చివేస్తాడు. ఆ తరువాత ఓరోజు రాత్రి తీవ్రమైన తుఫాను వచ్చి అవిశ్వాసుల సైనిక శక్తిని, సరంజామాను విచ్ఛిన్నం చేస్తుంది. దాంతో వారు భయపడి పారిపోతారు. ఈ విధంగా వారి పథకం బెడిసికొడ్తుంది.

యూదులు ముస్లింలతో చేసుకున్న ఒప్పందం ప్రకారం ముస్లింలతో కలసి అవిశ్వాసులకు వ్యతిరేకంగా యుద్ధం చేయాలి. కాని వారు క్లిష్టపరిస్థితిలో ఒప్పందాన్ని ఉల్లంఘించి విదేశీశక్తులతో చేతులు కలుపుతారు. అలాంటి విద్రోహులను శిక్షించడానికి దైవప్రవక్త (స) వారి వాడను ముట్టడిస్తారు. చివరికి యూదులు లొంగిపోయి శిక్ష అనుభవిస్తారు. ఆ తరువాత అరేబియాలోని యూదులంతా ఏకమయి, కొన్ని బహుదైవారాధక తెగలను కలుపుకొని ఇస్లాంను తుడిచిపెట్టాలని ప్రయత్నిస్తారు. కాని దేవుడు వారి పీచం అణచి ఇస్లాం జ్యోతిని మరింత ప్రకాశింపజేస్తాడు.

మహనీయ ముహమ్మద్ (స) ఆ తర్వాత 1400 మంది అనుచరుల్ని వెంటబెట్టుకొని కాబాయాత్ర (హజ్) చేయడానికి మక్కా వెళ్తే మక్కానాయకులు ఆయన్ని పట్నం వెలుపలే అటకాయిస్తారు. చివరికి ఒక ఒప్పందం జరుగుతుంది. దాని ప్రకారం ముస్లింలు ఈయేడు కాబాయాత్ర చేయకుండా మదీనా తిరిగెళ్ళిపోయి వచ్చేయేడు రావాలని ఉంటుంది. అందువల్ల ముస్లింలు మదీనా తిరిగెళ్ళిపోతారు. తరువాత సంవత్సరం కాబా యాత్ర జరుపుతారు. ఆ తరువాత కొన్నాళ్ళకు మక్కా అవిశ్వాసులు ఒప్పందంలోని ఒక షరతు ఉల్లంఘించి ముస్లింల మిత్రపక్షమైన మక్కాలోని ఖుజాఅ తెగపై దాడిచేసి ఊచకోతకు పాల్పడతారు. అందువల్ల దైవప్రవక్త (సల్లం) పదివేల మంది అనుచరులతో మక్కా వెళ్ళి పట్నం వెలుపల ఒకచోట విడిది చేస్తారు.

ఈ సైనికవాహినిని చూసి మక్కా బహుదైవారాధకులు భయపడతారు. వారి నాయకుల్లో కొందరు ఇదివరకే ఇస్లాం స్వీకరించి ముస్లింలలో చేరిపోతారు. ఇప్పుడు వారి ప్రధాన నాయకుడు అబూసుఫ్యాన్ కూడా ఇస్లాం స్వీకరిస్తాడు. అందువల్ల దైవప్రవక్త (సల్లం) ఎలాంటి రక్తపాతం లేకుండానే అనుచరులతో మక్కాలో ప్రవేశిస్తారు. కాబాలోని విగ్రహాలను తొలగించి విశ్వప్రభువుకు కృతజ్ఞతగా ప్రార్థన చేస్తారు. మక్కా అవిశ్వాసులు ఆయుధాలు క్రింద పడవేసి లొంగిపోతారు. దైవప్రవక్త (సల్లం)ను అనేక విధాలుగా వేధించి, ఆయన్ని శాశ్వతంగా కడతేర్చడానికి ప్రయత్నించిన బద్ధశత్రువులు సైతం లొంగిపోతారు. దైవప్రవక్త (స) వారందరినీ క్షమించి వదలిపెడతారు. వారిలో అత్యధిక మంది ఇస్లాం స్వీకరిస్తారు. ఆ తరువాత దైవప్రవక్త (సల్లం) మదీనా వెళ్ళిపోతారు.

ఒక యుద్ధంలో ఓడి సిరియా పారిపోయిన హాతింతాయి కొడుకు కొన్నాళ్ళకు ముహమ్మద్ (స) సద్వర్తం, సుగుణాలను గురించి తన సోదరి నోట విని ఆయన్ని కలుసుకోవడానికి మదీనా వస్తాడు. దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం) ఎంతో సంతోషిస్తూ అతడ్ని తన ఇంటికి పిలిచి కెళ్ళి గౌరవమర్యాదలు జరుపుతారు. ఇంట్లో ఉన్న ఒకే ఒక దిండును అతనికిచ్చి తాను కటికనేల మీద కూర్చుంటారు. దాంతో అతను ఎంతో ప్రభావితుడయి ఇస్లాం స్వీకరిస్తాడు.

మహాప్రవక్త ముహమ్మద్ (స) తన అనుచరుల పట్ల ఎలా ప్రవర్తించే వారో కూడా చూడండి. ఆయన, ఆయన అనుచరులు ప్రయాణం చేస్తూ ఒక చోట మజిలీ చేస్తారు. గుడారుల వేయడం, ఒంటెలకు నీళ్ళు పెట్టడం, భోజనం తయారు చేయడం మొదలైన పనులు చేయడానికి అనుచరులు ఉపక్రమిస్తారు. అప్పుడు ముహమ్మద్ (సల్లం) తాను అగ్ర నాయకుణ్ణి అనుకుంటూ కాలుమీద కాలువేసి దర్జాగా కూర్చున్నారా? లేదు. తాను కూడా ఏదో ఒక పని చేయాలి కదా అని భావించి వంటకోసం కట్టెలు ఏరి తెచ్చే పనికి సిద్ధపడతారు. అనుచరులు వారించినా వినలేదు.

మరొకసారి శత్రుదాడిని ఎదుర్కోవడానికి మదీనా చుట్టూ కందకం తవ్వవలసి వచ్చినపుడు ఒక్కొక్క అనుచరునికి పదేసి గజాల చొప్పున కేటాయించారు. అప్పుడు మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) తన కోసం కూడా ఓ పదిగజాల నేలను కేటాయించుకొని తవ్వకం మొదలెడతారు. అవి ముస్లింలకు చాలా కఠినమైన రోజులు. అనుచరులలో అనేక మంది చాలినంత తిండి దొరక్క నకనకలాడసాగారు. ఒక అనుచరుడయితే ఆకలికి తట్టుకోలేక కడుపు మీద రెండు గులకరాళ్ళు కట్టు కున్నాడు. అప్పటికీ బాధ భరించలేక దైవప్రవక్త (సల్లం) దగ్గరికెళ్ళి తన ఆకలిబాధ గురించి ఏకరవు పెట్టుకుంటూ పొట్ట మీద కట్టుకున్న రెండు రాళ్ళను చూపించాడు. దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం) ఆ అనుచరుడి వైపు జాలిగా చూస్తూ తన పొట్ట మీది చొక్కా పెకెత్తి చూపించారు. అక్కడ మూడు రాళ్ళు కట్టబడి ఉన్నాయి. ఈ దృశ్యం చూసి అనుచరుడి కళ్ళు చెమర్చాయి.

వేరొకసారి ఆయన అనుచరులతో కలసి ప్రయాణం చేస్తుంటే దారిలో నీటి కొరత ఏర్పడింది. ఎండలు పెటపెటలాడుతున్న రోజులవి. అందరూ తీవ్రమైన దప్పికతో



ఉన్నారు. చివరికి ఎలాగో నీళ్ళు లభించాయి. అప్పుడు మహాప్రవక్త ముహమ్మద్ (స) తోలుతిత్తిలోని నీటిని అనుచరులందరికీ పోసిన తరువాత చివర్లో మిగిలిన కొంచెం నీళ్ళను తాగారు. ఆ సందర్భంలో ఆయన మాట్లాడుతూ "అనుచరులందరికీ తాగించిన తరువాత చివర్లో తాగేవాడే నాయకుడు" అని అన్నారు.

ఇస్లాం రాకముందు అరేబియాలో స్త్రీల పరిస్థితి చాలా అధ్వాన్నంగా ఉండేది. పురుషులు వారిని బానిసలుగా చూసేవారు; తమ భార్యల్ని చీటికిమాటికి చితకబాదేవారు. మహనీయ ముహమ్మద్ (సల్లం) దైవప్రవక్తగా స్త్రీలను గురించి ఎన్నో సంస్కరణలు ప్రవేశపెట్టి వారి పరిస్థితి మెరుగుపరచారు. దాంతో వారు భర్తలు చెప్పే ప్రతి మాటకు తలూపకుండా దైవాజ్ఞల ప్రకారమే నడచుకోవడం ప్రారంభించారు. చివరికి కొందరు స్త్రీలు తమ భర్తలకు ఎదురుచెప్పే స్థాయికి కూడా చేరారు. దైవప్రవక్త (స) ఓ సారి స్త్రీలను గురించి అనుచరులకు హితబోధచేస్తూ "ఎవరు తన భార్యాపిల్లల విషయంలో మంచివాడో అతనే మీలో మంచివాడ"ని అన్నారు. మరో సందర్భంలో మాట్లాడుతూ "విశ్వాసులలో అందరికన్నా ఎక్కువ గుణవంతుడే పరిపూర్ణ విశ్వాసి. అలాగే మీ భార్యాపిల్లల పట్ల మంచివాడే మీలో అందరికన్నా ఎక్కువ శ్రేష్ఠుడు" అని ఉపదేశించారు.

ఈవిధంగా మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) సుగుణసంపత్తి గురించి ఎన్ని ఉదాహరణలు అయినా ఇవ్వచ్చు. ఆయన నోట వెలువడిన ఒక్కొక్క మాట ఒక్కొక్క ముత్యం అని చెప్పవచ్చు. ఆయన ఒకసారి "శ్రామికుని చెమట ఆరక ముందే అతని కూలి డబ్బు అతనికి ఇచ్చేయండి" అన్నారు. మరొకసారి "పొరుగువాడు పస్తుండగా కడుపునిండా తినేవాడు నిజమైన ముస్లిం కాడ"ని అన్నారు. వేరొకసారి ఆయన ఇస్లామీయ రాజ్యంలోని ముస్లిమేతరులను గురించి మాట్లాడుతూ "ముస్లిమేతరునికి ఏదైనా అన్యాయం జరిగినా లేదా అతనిపై మోయలేని భారం వేసినా పరలోక తీర్పు దినాన నేను ఆ ముస్లిమేతరుని తరఫున నిలబడి వాదిస్తాను" అని చెప్పారు.

మహనీయ ముహమ్మద్ (స) దైవప్రవక్త అయిన 23 ఏండ్ల కాలంలో యావత్తు అరేబియాలో ఇస్లాం విస్తరించింది. అరబ్బుల జీవనసరళి పూర్తిగా మారిపోయింది. సర్వత్రా శాంతిసుస్థిరతలు నెలకొన్నాయి. దైవప్రవక్త (స) లక్ష్యం నెరవేరింది. అందువల్ల దేవుడు ఆయన్ని 63 ఏండ్ల వయస్సులో తన దగ్గరకు పిలిపించుకుంటాడు. ప్రతి మనిషీ ఏదో ఒక రోజు దేవునికి దగ్గరకు పోవలసినవాడే. ముహమ్మద్ మహనీయుని (సల్లం) పై దేవుడు శాంతిసౌభాగ్యాలు వర్షింప జేయుగాక.